క్లుప్తంగా

మల్లన్న ఆలయంలో రేణుకాచార్య జయంతి



రేణుకాచార్య జయంతి నిర్వహిస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో జగద్గురు రేణుకాచార్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేష ద్రవ్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు మహాదేవుని మల్లికార్జున్ మాట్లాడుతూ కృతయుగంలో మానవులంతా సమానమని, అందరికీ సమాన హక్కులు ఉండాలని 18 కులాలకు 18 మతాలను రేణుకాచార్య స్థాపించాడన్నారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, ఆగమ పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట అలయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డు అందజేస్తున్న అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు శ్రీపంకజ వాస్తవ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆగ్రాలో రెండు రోజుల పాటు జరిగిన అలయన్స్ క్లబ్ అంతర్జాతీయ సదస్సులో 28 దేశాల ప్రతినిధులు పాల్గొన్నట్లు శుక్రవారం సిద్దిపేట అలయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. ఈ సదస్సులో సిద్దిపేట జిల్లాకు చెందిన సోమ వనజకు బెస్ట్ గవర్నర్ అవార్డు, చకిలం బాలచంద్రంకు బెస్ట్ వైస్ గవర్నర్ అవార్డు, ఐసీసీగా మోర అంజయ్యకు అవార్డు అందుకున్నారు. అలయన్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు శ్రీపంకజ వాస్తవ అవార్డులు అందజేశారు. అవార్డులు పొందిన వారిని సిద్దిపేట జిల్లా అలయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు.

ఘనంగా శాలివాహన చక్రవర్తి జయంతి



నినాదాలు చేస్తున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శాలివాహన కుల ఆరాధ్య దైవం శాలివాహన చక్రవర్తి జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సిద్దిపేటలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాలివాహన సంఘం జిల్లా అధ్యక్షుడు దరిపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ రాజకీయ చరిత్రలో గతించిన చక్రవర్తులు, రాజులు, ప్రధాన మంత్రుల జయంతులు, వర్ధంతులు మాత్రమే నిర్వహించుకుంటున్నామన్నారు. శక పురుషుడుగా కేవలం శాలివాహనుడికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తిరుపతి, భూమయ్య, కనకయ్య, శేఖర్, బాలు, బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామ్మోహన్

మద్దూరు(హుస్నాబాద్): వచ్చే హరితహారం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ రామ్మోహన్ నర్సరీ నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వల్లంపట్ల గ్రామంలోని నర్సరీ, డంపింగ్ యార్డులతో పాటు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే హరితహారం నాటికి మొక్కలను సిద్ధంగా ఉంచాలన్నారు. అలాగే ఉపాధి హామీ కూలీలకు పని ప్రదేశంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరగా ఉంచాలన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మహేందర్ ఉన్నారు.

కుక్కలదాడిలో దూడ మృతి

మద్దూరు(హుస్నాబాద్): కుక్కల దాడిలో దూడ మృతి చెందింది. మండలంలోని లద్నూరు గ్రామంలో గ్రామానికి చెంది రైతు వజ్జల భీష్మాచారి రోజు మాదిగానే తన వ్యవసాయ బావి వద్ద పశువులను కట్టేసి ఇంటికి వచ్చాడు. శుక్రవారం తెల్లవారు జామున వెళ్లి చూడగా కుక్కల దాడిలో దూడ మృతి ఉండటం గమనించాడు. గ్రామంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని రైతులు చెబుతున్నారు.

నిర్మాణాలకు నిధుల కొరత

- ప్రభుత్వ పాఠశాలల్లో డైనింగ్ హాళ్ల నిర్మాణం
- ఏడాది దాటినా ముందుకు సాగని వైనం
- ఐదు నిర్మాణాల్లో ఒకటి పూర్తి
- మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని డిమాండ్



గుడికందులలో పిల్లర్లస్థాయిలో నిలిచిపోయిన డైనింగ్ హాల్

విద్యార్థుల సౌకర్యం కోసం చేపట్టిన డైనింగ్ హాళ్ల నిర్మాణ పనులు నత్తనడకసాగుతున్నాయి. అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం మన ఊరు- మన బడి కార్యక్రమం చేపట్టింది. ఇందులో మధ్యాహ్న భోజనం ఆరు బయట తింటున్న విద్యార్థుల కోసం డైనింగ్ హాళ్ల నిర్మాణం చేపట్టింది. ఇందుకోసం ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది.

తొగుట(దుబ్బాక): మండల కేంద్రమైన తొగుట, కాన్గల్, వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట, ఘనపురం, గుడికందుల గ్రామాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలున్నాయి. అందులో 864 మంది బాలబాలికలు చదువుకుంటున్నారు. ఆరు పాఠశాలలకు గాను తొగుట, ఎల్లారెడ్డిపేట, గుడికందుల, వెంకట్రావుపేట, కాన్గల్ పాఠశాలలకు ప్రభుత్వం డైనింగ్ హాళ్లు మంజూరు చేసింది. ఒక్కో పాఠశాలకు రూ.16 లక్షల చొప్పున ప్రభుత్వం మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. వెంకట్రావుపేట, ఎల్లారెడ్డిపేట పాఠశాలల్లో గోడలు నిర్మించి పైకప్పు రేకులు వేశారు. గుడికందుల పాఠశాలలో పిల్లర్ల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. తొగుట పాఠశాలలో పూర్తిచేయడంతో ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ ప్రారంభోత్సవం చేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు మధ్యలోనే వదిలేశారన్న విమర్శలున్నాయి. అధికారులు స్పందించి డైనింగ్ హాళ్ల నిర్మాణాలు పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

> **భోజనశాలల నిర్మాణం పూర్తిచేయాలి**
>
> మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో కోతులు మా పైకి వస్తుంటాయి. చేతులు, ప్లేట్లు శుభ్రం చేసుకునే వీలులేకుండా ఉంది. మేం భోజనం చేసేదాక ఉపాధ్యాయులు కాపలాగా ఉంటారు. వంట చేసే సమయంలో అక్కడ కాపలాగా ఉండాల్సివస్తోంది. భోజనశాలను వెంటనే పూర్తిచేసి కోతుల నుంచి రక్షించాలి.
>
> – మమత, 8వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఎల్లారెడ్డిపేట
>
> నిధుల కొరతతో మధ్యాహ్న భోజనశాలల నిర్మాణాలు నిలిచిపోయాయి. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. తొగుట పాఠశాలలో పనులు పూర్తిచేసి వినియోగంలోకి తీసుకొచ్చాం. కొద్ది రోజుల్లో ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశముంది.
>
> – రామకృష్ణారెడ్డి, ఏఈ పంచాయతీరాజ్ శాఖ, తొగుట మండలం

పాఠశాలల్లో కోతుల బెడద

భోజనశాలల నిర్మాణం పూర్తికాకపోవడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం ఆరుబయట తింటున్నారు. విద్యార్థులు భోజనం చేసేటప్పుడు కోతులు దాడికి దిగుతున్నాయి. దీంతో వాళ్లు భోజనం చేసేదాక ఉపాధ్యాయులు కాపలా ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కోతుల భయంతో ఎల్లారెడ్డిపేట పాఠశాలలో చెట్లు కొట్టివేశారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పలత



పోషణ పక్ష వారోత్సవాల్లో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

మద్దూరు(హుస్నాబాద్): పోషకాహారంతోనే పిల్లలు, తల్లులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ పుష్పలత అన్నారు. శుక్రవారం దూళ్మిట్ట మండలంలోని కొండాపూర్ రైతువేదికలో పోషణ పక్షం వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేటఅర్బన్: బాలింతలు, గర్భవతులు, చిన్న పిల్లలు పోషకాహారం తీసుకోవాలని ఇన్‌చార్జి సీడీపీఓ రమాదేవి అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి గ్రామంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులకు సామూహిక సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహాలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చౌదరిపల్లి మత్స్యపారిశ్రామిక సహకార సంఘ ఎన్నిక



ఎన్నిక పత్రం అందజేస్తున్న స్పెషల్ ఆఫీసర్ రేఖ

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం చౌదరిపల్లి మత్స్య పారిశ్రామిక సహకార సంఘ ఎన్నికలు శుక్రవారం ఏకగ్రీవంగా జరిగాయి. చైర్మన్‌గా వరుసగా మూడోసారి పడిగె రాజు ఎన్నికయ్యాడు. గ్రామపంచాయతీ వద్ద జిల్లా కోఆపరేటివ్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రేఖ ఎన్నికల స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. మొదట తొమ్మిది మంది డైరెక్టర్ల ఎన్నిక జరిగింది. ఆ తరువాత వారిలో డైరెక్టర్‌ను సహకార సంఘ చైర్మన్‌గా, వైస్‌చైర్మన్, సెక్రటరీగా ఎన్నుకున్నారు. చైర్మన్‌గా పడిగె రాజు, వైస్‌ప్రెసిడెంట్‌గా నర్సింహులు, సెక్రటరీగా కె.కనకయ్య, డైరెక్టర్లుగా రవి, ఆగయ్య, పోచయ్య, వెంకటయ్య, చంద్రం, మహేష్ నియమితులయ్యారు.

అందరికీ యోగా అవసరం

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరికి యోగా అవసరమని యూనియన్ బ్యాంక్ సిద్దిపేట రీజినల్ హెడ్ వికాస్ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యాస మహర్షి యోగా కేంద్రంలో బ్యాంక్ ఉద్యోగులకు ప్రత్యేక యోగా తరగతులు నిర్వహించారు. ఆరోగ్యం కోసం ధ్యానం, యోగా చేయాలన్నారు. ఉద్యోగులు మానసికంగా బలంగా ఉండేందుకు యోగా ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ హెడ్ రాఘవ, యోగా గురువు సతీష్, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సిద్దిపేటకమాన్: అక్రమంగా ఇంట్లో నిల్వ చేసిన మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని పటేల్‌పూరలో గాదగోని నారాయణ ఇంట్లో ప్రభుత్వ అనుమతి లేకుండా బెల్ట్ షాపు నడుపుతున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు టూటౌన్ పోలీసులు తనిఖీ చేపట్టారు. అతడి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 16.04 లీటర్ల విస్కీ, బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఓ కుంటలో మట్టి తవ్వకాలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ ముదిరాజ్ సంఘం నాయకులు ఇరిగేషన్ ఈఈ వెంకటకృష్ణ రావు, డీఈఈ మధుసూదన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు మండల కేంద్రంలోని బావండ్ల కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మిట్టపెల్లి మొండయ్య, ప్రధాన కార్యదర్శి చింతాల బాలరాజు మాట్లాడారు. మండల కేంద్రంలో ఊరు చెరువుతో కలుపుకొని మొత్తం 16 కుంటలు ఉన్నాయన్నారు. అందులో బావండ్ల కుంట దాదాపు 1.20 ఎకరాల్లో ఉంటుందన్నారు. ఈ కుంట ఆయకట్టు సుమారు 25 ఎకరాలు ఉంటుందని తెలిపారు. కొన్ని రోజులుగా కుంటలో మట్టి తవ్వకాలు జరుపుతున్నారన్నారని, వారిపై చర్యలు తీసుకొని కుంటను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఇరిగేషన్ డీఈఈ మాట్లాడుతూ చెరువులు, కుంటల్లో మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తీసుకుంటామన్నారు. బావండ్ల కుంట నుంచి మట్టిని తరలించిన వ్యక్తిని తిరిగి మట్టితో కుంటను పూడ్చాలని ఆదేశించామన్నారు.

పర్యావరణాన్ని రక్షిద్దాం

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి పిలుపు ఇచ్చారు. శుక్రవారం రంగనాయక సాగర్ రిజర్వాయర్ సమీప నర్సరీని సందర్శించారు. మొక్కలకు నీళ్లు పోశారు.

నీరు భావితరాల సంపద

తొగుట(దుబ్బాక): నీరు భావితరాల సంపద అని బాల వికాస సంస్థ ప్రతినిధి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లారెడ్డిపేటలో ప్రపంచ నీటి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నీటిచుక్కను పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటిని ఆదాచేస్తే భావితరాలకు మనం ఇచ్చే కానుకవుతుందన్నారు. ప్రతీ కుటుంబం ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలాచేసి భూగర్భజలం పెరిగేలా కృషిచేయాలన్నారు. అంతకు ముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సయ్య, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ఫరీద్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): ప్రతీ నీటిచుక్కను పొదుపుగా వాడుకుంటూ భావితరాలకు అందించడమే మనం వారికిచ్చే కానుక అని మాజీ సర్పంచ్ కంతరెడ్డి జనార్దన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా బాలవికాస ఆధ్వర్యంలో మద్దూరు, లద్నూరు, సలాఖపూర్‌లో ర్యాలీ తీసి ప్రజలకు నీటి పొదుపుపై అవగాహన కల్పించారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో రైతుకు మేలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ అఫ్రోజ్

చేర్యాల(సిద్దిపేట): అధిక సాంద్రత పత్తి సాగుతో రైతుకు మేలు జరుగుతుందని ఏఓ అఫ్రోజ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ముస్త్యాల గ్రామ రైతువేదికలో కృషి విజ్ఞాన కేంద్రం మెదక్, నూజివీడు సీడ్స్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి సాగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం, సీడ్స్ కంపెనీ అధికారులు మాట్లాడారు. అధిక సాంద్రత పత్తి సాగుతో రైతులకు మేలు జరుగుతుందని, ఎకరం సాగుకు ఆరు ప్యాకెట్ల పత్తి విత్తనాలు సరిపోతాయన్నారు. దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్లు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ రవి కుమార్, కీటక శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఉదయ్‌కుమార్, వ్యవసాయ యాంత్రిక విభాగ శాస్త్రం డాక్టర్ ఎస్.ప్రతాపరెడ్డి, సేద్య విభాగ శాస్త్రవేత్తలు, నూజివీడు సీడ్స్ సంస్థ ప్రతినిధులు, ఏఓలు నరేష్, రామకృష్ణ, ఏఈఓ కల్యాణి, రైతులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య



పాఠశాల యాజమాన్యంతో మాట్లాడుతున్న కమిషనర్ నర్సయ్య

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ నర్సయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలో పర్యటించి రైస్ మిల్లులు, పెట్రోల్ బంకులు, ప్రైవేటు పాఠశాలల యజమానులతో మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ వ్యాపార లైసెన్సులు పొందాలన్నారు. అలాగే సకాలంలో ఇంటి పన్నులు చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వడ్డీపై 90 శాతం రాయితీ ఈనెల 31 తేదీతో ముగుస్తుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాతాల ఫ్రీజ్‌పై కాంగ్రెస్ ఆందోళన



గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): ఫ్రీజింగ్ చేసిన కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను వెంటనే పునరుద్ధరించాలని కోరుతూ శుక్రవారం పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కమలాకర్‌యాదవ్ మాట్లాడారు. ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ రాజకీయ కార్యకలాపాలను అడ్డుకునేందుకు బ్యాంకు ఖాతాల ఫ్రీజింగ్ చేయడం సరికాదన్నారు. దేశంలో ఎలక్ట్రోరల్ బాండ్ల ద్వారా అత్యధిక డొనేషన్లు 78 శాతం బీజేపీకి రాగా, కేవలం 16 శాతం మాత్రమే కాంగ్రెస్ పార్టీకి వచ్చాయన్నారు. ఈ డొనేషన్లను ఎన్నికల ప్రచారానికి వాడుకోనివ్వకుండా కాంగ్రెస్‌ని ఇబ్బంది పెట్టాలని బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటికైనా తమ వైఖరి మార్చుకొని వెంటనే కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు చెవిటి లింగం, సందుల సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆరోపణల్లో నిజం లేదు



ప్రభుత్వం ఇచ్చిన ప్రొసీడింగ్ కాపీలను చూపుతున్న లబ్ధిదారులు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పొన్నాల శివారులోని సర్వే నంబర్ 21లోని స్థలం కబ్జా చేశారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని, అవన్నీ నిరాధారమైన ఆరోపణలని పట్టాలు తీసుకున్న లబ్ధిదారులు, ఆరోపణలు ఎదుర్కొంటున్న స్థానిక నాయకులు తెలిపారు. శుక్రవారం పొన్నాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. లబ్ధిదారులకు 2022 లో అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే హరీశ్ రావు చేతుల మీదుగా అప్పటి ఎమ్మార్వో విజయసాగర్ ఆధ్వర్యంలోనే పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. స్థానిక నాయకులు, అధికారి అండదండలతో కబ్జా చేసి అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. స్థానిక నాయకులు కేకే రావు, తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తూ మనోవేదనకు గురిచేస్తున్నారని, నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ వరి సాగులో జాగ్రత్తలు పాటించండి

కోహెడరూరల్(హుస్నాబాద్): వరి సాగులో కాండం తొలుచు పురుగు, మెడ విరుపు తెగులు నివారణకు తగ్గిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈఓ శివకుమార్ సూచించారు. మండలంలోని వరికోలు గ్రామంలో వరి చేలను పరిశీలించారు. వరి సాగులో గట్ల వెంబడి కలుపు మొక్కలను తొలగించాలని సూచించారు.

◆ ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరులోని గంగాభవానీ ఆలయ 23వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హోమాలు, అర్చనలు, అమ్మవారికి అభిషేకాలు జరిగాయి. అలాగే భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

◆ నిత్యావసర సరుకుల పంపిణీ

మిరుదొడ్డి(దుబ్బాక): రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మిరుదొడ్డిలో శుక్రవారం మండల పరిధిలోని 70 నిరుపేద ముస్లిం కుటుంబాలకు అదే గ్రామానికి చెందిన డాక్టర్ మహ్మద్ సాహెబ్ హుస్సేన్ నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మహిళలకు నూతన వస్త్రాలు అందజేశారు.

◆ బీఆర్ఎస్ విజయం ఖాయం

సిద్దిపేటజోన్: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్‌రామ్ రెడ్డిని ప్రకటించడంతో పార్టీ గెలుపు ఖాయమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మచ్చ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మెదక్ పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి పేరును కేసీఆర్ ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. సాధ్యం కానీ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఒక్క హామీ నెరవేర్చలేదని ఆరోపించారు.

◆ నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు

కొండపాక(గజ్వేల్): ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తొగుట సీఐ లతీఫ్ హెచ్చరించారు. కుకునూరుపల్లి మండలం మంగోల్ గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసు కళాబృందం ఎన్నికల నియమ నిబంధనలపై కనువిప్పు కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో అల్లర్లు చేసేవారిపై భారత ఎన్నికల సంఘం నూతనంగా ప్రవేశ పెట్టిన సి- విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు.

◆ ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కమిటీ ఎన్నిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): ప్రభుత్వ భూములు, భవనాల సంరక్షణ కమిటీని శుక్రవారం జగదేవ్‌పూర్ గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, యువకులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా మునీర్, అధ్యక్షుడిగా వెంకట్ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షులుగా కనకయ్య, రమేష్, నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా మల్లేశం, సలహాదారులుగా నర్సింహులు, మచ్చ నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌నర్సయ్య, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

◆ బీఆర్ఎస్ నాయకుల సంబరాలు

దుబ్బాక: మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డి పేరును అధిష్టానం ప్రకటించడంతో శుక్రవారం దుబ్బాకలో బీఆర్ఎస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. అనంతరం జెడ్పీటీసీ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి పేరును అధిష్టానం ప్రకటించడం సంతోషకరమన్నారు. ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమి లేదని ఆరోపించారు.

◆ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ ఆర్యవైశ్య భవనం వద్ద శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదేవత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు.

◆ నేత్రపర్వంగా పెద్దమ్మ పెద్దిరాజు కల్యాణం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో పెద్దమ్మ, పెద్దిరాజుల కల్యాణం శుక్రవారం నేత్రపర్వంగా నిర్వహించారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కుల దేవతల కొలుపులు ఎక్కువగా జరుగుతాయన్నారు.

◆ లారీని ఢీకొన్న కారు

బెజ్జంకి(సిద్దిపేట): ఆగివున్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు స్థానికులు తరలించారు. వారి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తోటపల్లి శివారు రాజీవ్ రహదారిపై శుక్రవారం తోటపల్లి శివారు రాజీవ్ రహదారి పక్కన లారీ నిలిపివుంది. ఈక్రమంలో హైదరాబాద్ నుంచి వస్తున్న కారు లారీని ఢీ కొట్టడంతో కారు నడుపుతున్న వ్యక్తి, అతడి తల్లికి గాయలయ్యాయి. వెంటనే చికిత్స కోసం కరీంనగర్‌కు తరలించారు. క్షతగాత్రులు జగిత్యాలకు చెందినవారని తెలిపారు. కాగా ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు చెప్పారు.

◆ రైతులకు పరిహారం అందించాలని వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోయి పరిహారం అందని ఎనిమిది మంది రైతులకు నష్ట పరిహారం అందించాలని బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగోజు నాగరాజు సిద్దిపేట ఆర్డీవో బంకిలాల్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూములు కోల్పోయిన రైతులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కుంటున్నారని, వారికి నష్ట పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

◆ సిద్దిపేట జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీ ఎన్నిక

సిద్దిపేటకమాన్: సిద్దిపేట జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అయిత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా రాజబాబు, కార్యదర్శిగా మహిపాల్ రెడ్డి, కోశాధికారిగా నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడిగా మల్లారెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా పర్షరాములు, రాజు, గౌరవ సలహాదారులుగా వెంకన్న, మహేష్, యాదగిరి, కమిటీ సభ్యులుగా గణేష్, చందు, వెంకట్, అశోక్, సంతోష్ ఎన్నికయ్యారు.

◆ ఉపాధి హామీ కూలీ బకాయి చెల్లించాలి

దుబ్బాకరూరల్: ఉపాధి హామీ కూలీలకు బకాయి చెల్లించాలని డీబీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు భీమ్‌శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని రామక్కపేట గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. అనంతరం వారి సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెంటెండ్‌కు వినతి పత్రం అందజేశారు.

◆ వైభవంగా శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ప్రాణప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం రమణీయంగా నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు తరలివచ్చారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

◆ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఏర్పాటు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పాములపర్తి, మర్కూక్ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఏర్పాటు చేశారు. మర్కూక్ పాఠశాల చైర్మన్‌గా మౌనిక, కన్వీనర్‌గా వెంకటేశం, పాములపర్తి పాఠశాల చైర్మన్‌గా కనకమ్మ, కన్వీనర్‌గా షేక్ లతీఫైదాను ఎన్నుకున్నారు. ఈ సందర్భం ఎంపీడీఓ అఫ్జలుద్దీన్, తహసీల్దార్ చంద్రశేఖర్‌రావు, ఎంఈఓ ఉదయ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో 18 ఏళ్లు నిండినవారిని ఓటరుగా పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భాస్కర్, ఏపీఓ కిరణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.